


కొనసాగిన రిలే దీక్షలు

ప్రజాశక్తి-పాడేరు: మండలంలోని చింతలవీధి పంచాయతీలో వైసీపీ కార్యాలయానికి భూమి కేటాయించడం చట్ట విరుద్ధమని, వెంటనే దీన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గిరిజనులు వివాద స్థలంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాలుగవ రోజు కొనసాగాయి. ఈ రిలే దీక్షలో పాల్గొన్న గిరిజన సంఘం జిల్లా నాయకులు ఎల్ సుందర్‌రావు మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్, ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి వెంటనే స్పందించి వైసిపి కార్యాలయ నిర్మాణ పనులను తక్షణమే నిలిపి చేయాలన్నారు. ఈ భూమిని సాగు చేసుకుంటూ దీర్ఘకాలంగా జీవనోపాధి పొందుతున్న గిరిజనులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈ రిలే దీక్షలో నడింవీధి ఉబ్బేడి పుట్టు గ్రామస్తులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న స్థానికులు

ప్రజాప్రతినిధులూ..మౌనమేల

▶▶ బోయ, వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేరుస్తూ ప్రభుత్వం తీర్మానం
▶▶ వ్యతిరేకించని వైసిపి ఎమ్మెల్యేలు, ఎంపీలపై గిరిజనాగ్రహం
▶▶ ఇప్పటికే మిన్నంటిన ఆందోళనలు ▶▶ నేడు మన్యం బంద్

ప్రజాశక్తి-పాడేరు టౌన్: వైసిపి ప్రభుత్వ పాలనలో షెడ్యూల్ ప్రాంతాల్లోని గిరిజనుల మనుగడ లేకుండా చేసే ఘటనలు గిరిజనులను కలవరపాటుకు గురి చేస్తున్నాయి. ఎన్నడూ లేని విధంగా వైసిపి ప్రభుత్వ హయాంలో ఇప్పటికే గిరిజన ప్రాంతంలో గిరిజనుల హక్కులు, చట్టాలు నిర్వీర్యం అవుతుండగా.. తాజాగా బోయ/వాల్మీకి లను ఎస్‌టి జాబితాలో చేర్చేందుకు వైసిపి ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసింది. ఈ విషయమై అధికార వైసిపి పార్టీ గిరిజన ప్రజాప్రతినిధులు మిన్నకుండటంపై గిరిజనుల ఆగ్రహ జ్వాలలు మిన్నంటుతున్నాయి. వరుసగా గిరిజనుల మనుగడకు సంబంధించి రిజర్వేషన్లు, హక్కులు, చట్టాలు, ప్రయోజనాలు నిర్వీర్యం అవుతున్నప్పటికీ వైసిపి ఎంపి, ఎమ్మెల్యేలు, ఎస్‌టి కమిషన్ చైర్మన్ సీరియస్‌గా తీసుకోలేదని గిరిజనులు, గిరిజన ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. బోయవాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చేందుకు అసెంబ్లీలో తీర్మానానికి వ్యతిరేకంగా పార్టీలు, కులాలు, మతాలు, సంఘాలకతీతంగా గిరిజనులందరూ రోడ్డు ఎక్కుతున్నారు. జిల్లా, డివిజన్, మండల కేంద్రాలతో పాటు, సోషల్ మీడియాలో గిరిజనులు స్వచ్ఛందంగా వివిధ రూపాల్లో ఆందోళనలను, నిరసనలను హోరెత్తిస్తున్నారు. వైసిపి నాయకులు ప్రజాప్రతినిధులపై ఆగ్రహ జ్వాలలు కొనసాగిస్తున్నారు. ఇప్పటికే పలు గిరిజన ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా సంఘాల నాయకులు గిరిజన ప్రాంత ఎంపి, ఎమ్మెల్యేలతో పాటు ఎస్‌టి కమిషన్ చైర్మన్ కుంభ రవిబాబుపై తీవ్ర స్థాయిలో మండి పడుతున్నారు. గిరిజనులు సోషల్ మీడియాలో ఆయా వాట్సాప్ గ్రూపుల వేదికగా ఎస్‌టి కమిషన్ చైర్మన్ కుంభ రవిబాబుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అల్లూరి జిల్లా షెడ్యూల్డ్ ప్రాంతానికి ఏమాత్రం సంబంధం లేని కుంభ రవి బాబుకు ఎస్ టి కమిషన్ చైర్మన్‌తో పాటు ఎంఎల్‌సి పదవులు ఇచ్చింది అభివృద్ధి చెందిన ఇతర కులాలను ఎస్‌టి జాబితాలోకి చేర్చాలని నివేదిక ఇవ్వడానికా? అసలైన గిరిజనులకు మనుగడ లేకుండా చేయడానికా? అని ప్రశ్నిస్తూ విరుచుకు పడుతున్నారు. ఇతర కులాలను ఎస్‌టి జాబితాలో చేర్చేందుకు నివేదిక ఇవ్వడం తమను మోసం చేసినట్టేనని గిరిజన ప్రాంత ప్రజ ఆగ్రహం వ్యక్తం చేస్తోంది.

వైసిపి ప్రజాప్రతినిధులతో పాటు ఎస్‌టి కమిషన్ చైర్మన్ తీరుకు నిరసనగా అల్లూరి జిల్లాలో అడుగడుగునా నిరసనలు హోరెత్తుతున్నాయి. గిరిజనుల మనుగడకు ముప్పు వాటిల్లే ఘటనలపై హుకుంపేట, అనంతగిరి మండలాలకు చెందిన ఎస్‌టి కమిషన్ సభ్యులు ఏం చేస్తున్నారంటూ గిరిజనులు సోషల్ మీడియా వాట్సాప్ వేదికగా గిరిజనులు రగిలిపోతున్నారు. దీంతో, గిరిజనుల హక్కులు, చట్టాలు, రిజర్వేషన్లు, ప్రయోజనాల అమలు, మనుగడ సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిపై ఆదివాసీలు తీవ్ర అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నేడు రాష్ట్రవ్యాప్త మన్యం బంద్

బోయ, వాల్మీకి సహా అనుబంధ కులాలను ఎస్‌టి జాబితాలో చేర్చేందుకు అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గిరిజన సంఘం, ఆదివాసి హక్కులు, చట్టాల పరిరక్షణ జాయింట్ యాక్షన్ కమిటీ (జెఎసి) ఆధ్వర్యంలో ఈనెల 31న శుక్రవారం రాష్ట్రవ్యాప్త మన్యం బంద్ జరగనుంది. బంద్‌కు విపక్షాలు, ప్రజాసంఘాలు మద్దతు తెలిపాయి. ఈ బంద్ జయప్రదానికి గిరిజన సంఘం, జెఎసి వేర్వేరుగా గత నాలుగు రోజులుగా విస్తత ప్రచారం నిర్వహించింది. ముఖ్యంగా షెడ్యూల్డ్ ట్రైబ్ జాబితాలో ఇతర కులాలను చేర్చేందుకు వైసిపి ప్రభుత్వం చేసిన అసెంబ్లీ తీర్మానం వెనక్కి తీసుకోవాలి, ఇతర కులాలను ఎస్‌టి జాబితాలోకి చేర్చాలని నివేదిక ఇచ్చిన ఎస్‌టి కమిషన్ చైర్మన్ కుంభ రవిబాబుతోపాటు గిరిజన మంత్రి, ఎంపి, ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఈ బంద్ జరుగుతోంది.

బంద్‌కు సంపూర్ణ మద్దతు
యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మహేశ్వరరావు

డుంబ్రిగూడ:- బోయ వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేర్చడాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 31న గిరిజన సంఘాలు పిలుపునిచ్చిన మన్యం బంద్‌కు యుటిఎఫ్ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.మహేశ్వరావు చెప్పారు. స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, బీసీలైన బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్పిస్తే ఆదివాసీలు తీవ్రంగా నష్టపోవడంతో పాటు వారి అస్తిత్వాన్ని కోల్పోతారన్నారు. ఇప్పటికే నిరుద్యోగ సమస్యతో ఆదివాసి యువత కొట్టుమిట్టాడుతున్నారన్నారు. ఇటువంటి సమయంలో అన్ని రకాలుగా అభివృద్ధి చెందిన బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చితే ఆదివాసి నిరుద్యోగ యువత ఉపాధి అవకాశాల్లో తీవ్రంగా వెనుకబాటు కు గురవుతారని చెప్పారు. గిరిజన ప్రాంతంలో వంద శాతం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్న జిఓ 3 రద్దు చేసినా రివ్యూ పిటిషన్ దాఖలు చేయలేదని, దీంతో గిరిజన నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగిందని చెప్పారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్.బాలకృష్ణ, ఎల్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైసిపి ఎంపి, ఎమ్మెల్యేలు వైఖరి తెలపాలి

బోయ, వాల్మీకి సహా అనుబంధ కులాలను ఎస్‌టి జాబితాలో చేర్చాలంటూ అసెంబ్లీలో తీర్మానం చేసిన వైసిపి ప్రభుత్వం గిరిజనుల ఉద్యోగావకాశాల జిఒ-3 ప్రయోజనాలపై రెండున్నరేళ్లుగా పట్టించుకోలేదు. నిజమైన గిరిజనుల మనుగడకు నష్టం వాటిల్లే అసెంబ్లీ తీర్మానంపై వైసిపి ఎంపి, ఎమ్మెల్యేలు అభ్యంతరం చెప్పకపోవడం దారుణం. గిరిజన యువతకు ఉద్యోగ నియామకాల రిజర్వేషన్ చట్టబద్ధతపై గిరిజన సంఘం అనేక ఆందోళనలు చేపడుతున్నప్పటికీ ఆ దిశగా ఏ మాత్రం ప్రయత్నం చేయక పోవడం గిరిజనుల ప్రయోజ నాలపై వైసిపి ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిదర్శనంగా కనిపిస్తుంది.



సురేంద్ర,
గిరిజన సంఘం
రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

గిరిజనుల అస్థిత్వానికే పెద్ద దెబ్బ

ఇది గిరిజనుల అస్థిత్వానికే పెద్ద దెబ్బ. గిరిజనుల సహజ సంపదను దోచుకోవడానికి రాజకీయ పార్టీల ఎత్తుగడ. ఏజెన్సీ ప్రాంతంలో భూమి క్రయ, విక్రయాలకు ఆదివాసులకే హక్కు ఉంది. ఇతర కులాలను ఎస్‌టి జాబితాలో చేర్చితే ఇక్కడి భూములు, సహజ సంపద అన్యాక్రాంతం అవుతాయి. గిరిజనులకు రాజకీయ రిజర్వేషన్లు రాజ్యాంగం కల్పించింది. అసలైన గిరిజనులకు ఆ రిజర్వేషన్ దక్కకుండా పోతుంది. గిరిజనుల మనుగడ సమస్యలపై ఎంపి, ఎమ్మెల్యేలు తమ గొంతును విప్పకుండా ఉండటం సరికాదు.



లీమలి లావణ్య లత,
మాజీ సర్పంచ్- ములియాపుట్టు
హుకుంపేట మండలం, అల్లూరి జిల్లా

ఎంపీ, ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలి

అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన ఇతర కులాలను ఎస్‌టి జాబితాలో చేర్చాలంటూ అసెంబ్లీలో చేసిన తీర్మానానికి నిరసనగా ఎంపి, ఎమ్మెల్యేలు తమ పదవులకు రాజీనామా చేసి గిరిజన ప్రయోజనాల పట్ల తమకున్న చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి. బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడానికి వ్యతిరేకంగా గిరిజన ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా సంఘాలతో కలిసి పోరాడాలి. లేదంటే గిరిజనుల ఓట్లతో గెలిచిన ఎంపి, ఎమ్మెల్యేలు ఆదివాసీల మనోభావాలను గౌరవిస్తూ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి తీర్మానాన్ని రద్దు చేయించాలి.



ముఖి శేషాద్రి,
జిల్లా అధ్యక్షుడు
గిరిజన ఉద్యోగుల సంఘం

బాలిక మృతదేహం కలకలం
అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

ప్రజాశక్తి-గొలుగొండ (అనకాపల్లి జిల్లా)

రెండు రోజుల నుంచి కనిపించక పోయిన మైనర్ బాలిక బొడ్డేరు గెడ్డలో శవమై కనిపించింది. అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం డి.కొత్తూరు గ్రామానికి చెందిన తుర్రె చిన్నారి(14) అనకాపల్లి జిల్లా రోలుగుంట గ్రామంలో ఉన్న కస్తూర్బా బాలికల వసతి గృహంలో 9వ తరగతి చదువుతుంది. ఈ నెల 27న చిన్నారి డి.కొత్తూరు సమీపంలో ఉన్న గొలుగొండ మండలం లింగంపేట గ్రామంలో జరుగుతున్న తీర్థ మహోత్సవానికి స్వగ్రామమైన కొత్తూరుకు వచ్చింది.మంగళవారం ఉదయం పాఠశాలకు వెళతానని చెప్పి బయలుదేరిన చిన్నారి శవమై కనిపించడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నాయి. డి.కొత్తూరు గ్రామం నుండి గొలుగొండ మండలం చోద్యం చేరుకోవాలంటే మూడు కిలో మీటర్లు దూరం. ఈ మార్గమధ్యలో ఉన్న బొడ్డేరు గెడ్డలో చనిపోవడంపై అనుమానాలకు తావిస్తోంది. స్థానికులు గురువారం మృతదేహం గుర్తించి కేడిపేట పోలీసులకు సమాచారం అందించారు. దీంతో, నర్సీపట్నం రూరల్ సిఐ రమణయ్య, ఇన్‌చార్జ్ ఎస్సై నారాయణరావు సంఘటన స్థలంకు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. తల్లిదండ్రులు తమ కుమార్తె చిన్నారిగా గుర్తించడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనుమానస్పదంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక మృతిపై విచారణ చేసి దోషులను శిక్షించాలి

కొయ్యూరు : మండలంలోని ఆడాకుల పంచాయతీ దూసరి కొత్తూరు గ్రామానికి చెందిన బాలిక ఆప్పిలి చిట్టమ్మ (14) బొద్దేరు గెడ్డలో అనుమానాస్పందంగా మృతి చెందిన సంఘటనపై విచారణ చేసి దోషులను కఠినంగా శిక్షించాలని గిరిజన సంఘం అల్లూరి జిల్లా ఉపాధ్యక్షులు సరుమూర్తి సూరిబాబు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

మన్యం బంద్‌తో నైట్ సర్వీసులు రద్దు

ప్రజాశక్తి -సీలేరు

బోయ వాల్మీకి బొంతు కులాలను ఎస్‌టి జాబితాలో చేర్చుతూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయడాన్ని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఆదివాసీలు ఈ నెల 31న బంద్‌కు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఆర్టీసీ అధికారులు అప్రమత్తమయ్యారు. విశాఖ నుండి చింతపల్లి, సీలేరు మీదుగా భద్రాచలం వెళ్లే నైట్ సర్వీస్ బస్సులను గురువారం, శుక్రవారం రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. శనివారం నుంచి ఈ బస్సులు యథావిధిగా తిప్పుతున్నట్లు వెల్లడించారు. ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

గిరిజనులకు వ్యవసాయ పనిముట్లు పంపిణీ

ప్రజాశక్తి-చింతూరు

సిఆర్‌పిఎఫ్ 42 బెటాలియన్ ఆధ్వర్యాన స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో గురువారం నిర్వహించిన సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో భాగంగా పేద గిరిజనులకు వ్యవసాయం చేసుకోవడానికి పారలు, గునపాలు, మంచినీటి డ్రమ్ములు, రేడియోలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ పి.దివాకర్, డిప్యూటీ కమాండెంట్లు జేఎస్ సెకావత్, నితిన్, స్థానిక సీఐ అప్పలనాయుడు, వైద్య ఆరోగ్య, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

రాజవొమ్మంగి 11కేవీ, జడ్డంగి ఫీడర్ పరిధిలో శుక్రవారం విద్యుత్ లైన్లు వెంబడి ఉన్న చెట్లను తొలగించే కార్యక్రమం చేపడుతున్న నేపథ్యంలో ఉదయం 8 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని విద్యుత్ శాఖ సబ్ ఇంజనీర్ సురేష్ బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జడ్డంగి పరిధిలోని చికిలింత, అమీనాబాద్, వంచంగి, మారేడుబాక, వాతంగి, లోదొడ్డి పంచాయతీల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-పాడేరు: పాడేరు మోదకొండమ్మ అమ్మవారి జాతర మహోత్సవం సందర్భంగా 35 వ రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను పాడేరు శాసనసభ్యులు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి గురువారం ప్రారంభించారు. ముందుగా టోర్నీ నిర్వాహకులు ఏర్పాటు చేసిన కార్యమంలో ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, ట్రైకార్ చైర్మన్ సతక బల్లిబాబు, స్థానిక సర్పంచ్ కొ ట్టగుల్లి ఉషారాణి, సుబ్బారావు ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుల్లి సింహాచలం నాయుడు, ఎపి మెడికల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ తమర్భ నరసింగరావులు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, బుల్లిబాబు, సర్పంచ్ పి దొర మాట్లాడారు. టోర్నీలో పాల్గొంటున్న క్రికెట్ జట్లను ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి పరిచయం చేసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి బ్యాటింగ్ చేయగా చైర్మన్ బుల్లిబాబు బౌలిం చేసి చేసి టోర్నీని ప్రారంభించారు. సర్పంచ్ ఉషారాణి, పిన్నయ్య, సుబ్బారావు బ్యాటింగ్ చేసారు. టోర్నీ నిర్వాహకులు దుర్గారావు మాట్లాడుతూ, 75 టీంలు వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రధాన కార్యదర్శి ఎన్.కొండబాబు, యాదగిరి శ్రీను, ఉప్పల వెంకటరత్నం, కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి, జిల్లా కల్చరల్ అధ్యక్షుడు దిలీప్, వైసీపీ నాయకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇటుకల పండగ సందడి

ప్రజాశక్తి -అనంతగిరి: ప్రతి ఏడాది సాంప్రదాయ కంగా జరుపుకునే ఇటుకల పండుగ మండలంలో సందడిగా ఆరంభమైంది. ఈనెల 27న కొన్ని ప్రాంతాల్లో పండుగను జరుపుకోగా మరికొన్ని ప్రాంతాలలో 30న పండుగను మొదలుపెట్టారు. ప్రాంతాలను బట్టి వివిధ రూపాలలో పండుగను నిర్వహించుకుంటారు. పండుగ ముందుగానే ఇల్లులకు రంగులు చల్లి ముస్తాబు చేసుకుంటారు. కుటుంబ సభ్యులంతా కొత్త వస్త్రాలు ధరించుకుంటారు. వరి, సామలు వంటి విత్తనాలను వేరు వేరుగా బుట్టలలో పెట్టుకొని ఇంటి మూలన పెట్టుకొంటారు. మూడు లేదా తొమ్మిది రోజులు జరుపుకునే ఈ పండుగ చివరి రోజు గ్రామ శివారులో చక్కుదేవత వద్దకు గ్రామస్తులంతా రాత్రి చేరుకొని విత్తనాలను చక్కు దేవత వద్ద ఆ రాత్రంతా ఉంచుతారు. అనంతరం ఆ విత్తనాలను ప్రతి ఇంటింటికి పంచుకుంటారు. ఈ విత్తనాలతో పాటు ఇంట్లో ఉన్న విత్తనాలు కలిపి పంట పొలాలలో జల్లుకుంటారు.పండుగ సమయంలో దింసా నృత్యాలతో గ్రామాలలో కోలాహలం నెలకొంటుంది. చిన్న పిల్లలు సైతం రంగులు పూసుకుంటారు. అరకు ప్రధాన రహదారిపై టోల్ గేట్లు ఏర్పాటు చేసుకుని వాహనదారుల నుండి చందా వసూలు చేస్తారు. వచ్చిన మొత్తం డబ్బులలో గ్రామస్తులంతా కలిసి చివరి రోజు భోజనాలు ఏర్పాటు చేసుకుని పిల్ల పాపలతో తింటారు. ఈ రకంగా పండుగ నిర్వహించుకుంటే పంటలు బాగా పండుతాయని గిరిజనుల నమ్మకం.


చందాలు వసూలు చేస్తున్న యువకులు

అధ్వానంగా గంపరాయి రహదారి

- పక్కా రోడ్డు నిర్మాణం చేయని ప్రభుత్వం
- గాలిలో కలిసిన ఎమ్మెల్యే హామీ
- శ్రమదానంతో మరమ్మతులు చేసుకుంటున్న గిరిజనులు

ప్రజాశక్తి-కొయ్యూరు

మండలంలోని అంతాడ పంచాయతీ పరిధి గంపరాయి గ్రామానికి సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికి రహదారి లేకపోవడంతో నిత్యావసర సరుకుల కోసం బయటకు వెళ్లాలన్నా, అనారోగ్యంతో బాధపడుతున్న వారిని కనీసం ఆసుపత్రికి తీసుకుని వెళ్లాలన్నా తీవ్ర ఇబ్బందులు పడేవారు. గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోలేదు. దీంతో 2018 సంవత్సరంలో సుమారు 34 కుటుంబాల వారు సుమారు 4 లక్షల 80 వేల రూపాయల సొంత నిధులు సమకూర్చుకుని, శ్రమదానంతో రహదారి పనులు చేశారు. పక్కా రహదారి నిర్మాణానికి ఎన్నిసార్లు విన్నవించినా ప్రభుత్వం నుండి గాని, అధికారుల నుండిగాని ఎలాంటి స్పందన లేదు.


శ్రమదానంతో రహదారి మరమ్మతులు చేస్తున్న గిరిజనులు

వైసీపీ ప్రభుత్వంలో ఇటీవల చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అంతాడ పంచాయతీ పరిధిలోని సింగధార, ఎద్దుమామిడి గ్రామాల్లో పర్యటించారు. ఆ సమయంలో గ్రామానికి సరైన రహదారి లేక గిరిజనులు పడుతున్న ఇబ్బందులను ఆమె స్వయంగా చూశారు. గ్రామస్తులు పక్కా రహదారి నిర్మాణం చేయాలని విన్నవించగా, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి సానుకూలంగా స్పందించి హామీ కూడా ఇచ్చారు. కాని నెలలు గడుస్తున్నా ఆ హామీ అమలు కాలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత్యంతరం లేక గిరిజనులు మూడు రోజుల నుంచి సొంతంగా రహదారి మరమ్మతు పనులు చేసుకుంటున్నారు. తమ ఓట్లతో అధికారం అనుభవిస్తున్న ప్రజాప్రతినిధులకు తమ బాధలు కనిపించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పబ్లిసిటీ కోసం మీడియాల్లో ప్రకటనలు ఇస్తున్నారు తప్ప, ఆచరణలో అమలు కావడం లేదని, ఇచ్చిన హామీలను నెరవేర్చి, తమ చిత్తశుద్ధి నిరూపించుకోవాలని గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు.

అనాథ పిల్లలకు ప్రభుత్వం చేయూత

కొయ్యూరు సిడిపిఒ విజయకుమారి

ప్రజాశక్తి -కొయ్యూరు

18 సంవత్సరాలు లోపు అనాథ పిల్లలకు కేంద్ర ప్రభుత్వం ప్రతి నెలా రూ.4 వేలు చొప్పున ఆర్థిక చేయూత ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని కొయ్యూరు సిడిపిఒ విజయకుమారి తెలిపారు. మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రాన్ని గురువారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలు, లేదంటే తల్లి లేక తండ్రి లేని పిల్లల వివరాలను దగ్గరలోని అంగన్వాడీ కేంద్రాల్లో నమోదు చేయించాలని సూచించారు. అర్హులైన పిల్లల వివరాలతో పాటు తల్లి లేదా తండ్రి మరణ ధ్రువపత్రాలను ఇవ్వాలని, ఒక వేళ తల్లిదండ్రులు విడిపోతే సంబంధిత వీఆర్వో ధ్రువీకరణ పత్రం, తల్లి, తండ్రి, బిడ్డ ఆధార్ కార్డులు, బిడ్డ పుట్టిన తేదీ సర్టిఫికేట్, బిడ్డకు గార్డియన్‌గాఉన్నా, లేక తల్లిదండ్రుల్లో ఎవరో ఒకరు ఉంటే వారితో బిడ్డకు జాయింట్ బ్యాంక్ అకౌంట్ లేదా, బిడ్డ పేరిట బ్యాంక్ అకౌంట్, ఇద్దరు పిల్లలైతే రెండు బ్యాంక్ అకౌంట్లు మొదలగు వాటిలో అంగన్వాడీ కార్యకర్త వద్ద దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.


అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సిడిపిఒ విజయకుమారి


రాళ్లు తేలిపోయి ఉన్న రహదారి

రాళ్లు తేలిన పెద్దమట్టపల్లి- కుందులూరు రహదారి

- మధ్యలో నిర్మాణం నిలిపివేసిన వైనం
- గిరిజనుల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని పెద్ద మట్టపల్లి నుంచి కుందులూరు వెళ్లే రహదారి రాళ్లు తేలిపోయి, ఎక్కడికక్కడ గుంటలు పడ్డాయి. దీంతో ఈ మార్గంలో ప్రయాణానికి నరకం చూడాల్సిన దుస్థితి దాపురించింది. సుమారు 15 కిలోమీటర్లు పొడవునా రహదారి తవ్వి, మెటల్ వేసి వదిలేశారు. మారుమూల ప్రాంత అభివృద్ధి పథకంలో భాగంగా ఈ రహదారి నిర్మాణానికి మూడేళ్ల క్రితం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. నిర్మాణాలు చేపట్టిన కాంట్రాక్టరు మెటల్ వేసి కనీసం రోలింగ్ కూడా చేయకుండా చేతులెత్తేశారు. అయినప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకున్న పాపాన్న పోలేదు. దీంతో పలుచోట్ల మెటల్ పైకి తేలిపోయింది. తెల్లవారి గూడెం, గులేటివాడ మధ్యలో రాళ్లు తేలిపోవడంతో అంతాడ పంచాయతీకి చెందిన 15 గ్రామాల ప్రజలు రాకపోకల కోసం తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ గ్రామాలకు కొక్కరగూడెం నుండి ముల్కనపల్లి మీదుగా మరో రహదారి ఉన్నా దశాబ్ద కాలంగా ఈ రహదారి నిర్మాణం అసంపూర్తిగా ఉండిపోయింది. దీంతో టేకులూర్ నుండి కుందులూరు మీదుగా విఆర్ పురం వెళ్లడానికి ప్రజలు అత్యవసర సమయాల్లోనూ కాలినడన రాకపోకలు సాగించాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి టేకులూరు నుండి కుందులూరు వరకు, కుందులూరు నుంచి జల్లి వారి గూడెం, కుందులూరు మీదుగా పెద్దమట్టపల్లి వరకు రహదారి నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

తక్షణమే నిర్మాణం పూర్తి చేయాలి

వైసిపి పరిపాలనలో రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. పెద్ద మట్టపల్లి నుంచి కుందులూరు రహదారిని మూడేళ్ల నుండి నిర్మాణం చేయకుండా వదిలేశారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకొని ఈ రహదారిని పూర్తి చేయాలి. లేకుంటే ప్రజల్ని కూడగట్టి ఆందోళన చేస్తాం.

- సోయం చిన్నబాబు,
సిపిఎం మండల కార్యదర్శి

మన్యం బంద్‌ను జయప్రదం చేయండి


అరకులో బైక్ ర్యాలీనుద్దేశించి మాట్లాడుతున్న కిల్లో సురేంద్ర


జి.మాడుగుల మండలంలో ప్రచారం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-యంత్రాంగం

అరకులోయరూరల్:బోయ/వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చేందుకు వైసిపి ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయడాన్ని నిరసిస్తూ మండల కేంద్రంలోని అరకు సంత బయలు నుండి ఎన్టీఆర్ గౌండ్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కిల్లో సురేంద్ర మాట్లాడుతూ, రాయలసీమ ప్రాంతంలో ఉన్న బోయవాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని శాసనసభలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తీర్మానం చేయడం దారుణమన్నారు. దీనిపై గిరిజన ప్రాంత ప్రజలు ఓటు వేసి గెలిపించిన ఎమ్మెల్యేలు, ఎంపీలు ఎందుకు మౌనంగా ఉన్నారని సమాధానం చెప్పాలని ఆయన ప్రశ్నించారు. గిరిజన ప్రాంత ఐదోవ షెడ్యూలు ఏరియాలో గిరిజనులు మాత్రమే ఉండాలని రాజ్యాంగంలో ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం గిరిజన హక్కులు, చట్టాలను తుంగలో తొక్కి బోయ వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేర్చాలని తీర్మానం చేయడం గిరిజనులకు ద్రోహం చేయడమేనని విమర్శించారు. గిరిజన ప్రాంతంలో వంద శాతం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్న జిఓ 3 రద్దు చేసినా రాష్ట్ర ప్రభుత్వం రివ్యూ పిటిషన్ దాఖలు చేయలేదని, దీంతో గిరిజన నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగిందని చెప్పారు. గిరిజన సంస్కృతి సాంప్రదాయాలు కట్టుబాట్లకు భిన్నంగా ఉన్న బోయ,వాల్మికిలను ఎలా చేర్చుతారని మండిపడ్డారు. మన్యం బంద్లో ఎమ్మెల్యేలు, ఎంపీలు పాల్గొని మద్దతు తెలుపుతురా లేక గిరిజన ద్రోహులుగా మిగిలిపోతారో గిరిజన ప్రజానీకానికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బంద్ లో గిరిజనులు, వివిధ ఉద్యోగ, ప్రజాసంఘాలు, కార్మికులు, వ్యాపారస్తులు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు పొద్దు బాలదేవ్, సిపిఎం మండల కార్యదర్శి కె రామారావు, గిరిజన సంఘం మండల కార్యదర్శి పి రామన్న, గిరిజన సంఘం నాయకులు జగన్నాథం, మగ్గన, సుంకరమెట్ట సర్పంచ్ జి.చిన్న బాబు, కోగేశ్వరరావు, ప్రసాద్, ఎస్బి పోతురాజు, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

డుంబ్రిగూడ:ఈనెల 31న గిరిజన సంఘాలు, జేఏసీ పిలుపునిచ్చిన మన్యం బందును జయప్రదం చేయాలని గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు టి.సూర్యనారాయణ పిలుపునిచ్చారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, గిరిజన అంతా ముక్తకంఠంతో ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించాలని చెప్పారు. బంద్‌ను గిరిజన ఉద్యోగ ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు విజయవంతం చేయాలని ఆయన కోరారు.

అనంతగిరి:బోయ,వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడాన్ని వ్యతిరేకిస్తూ గిరిజన సంఘం ఆధ్వర్యాన మండలంలో ప్రచారం నిర్వహించారు.నాయకులతో కలిసి స్థానిక జెడ్పిటిసి డి.గంగరాజు ప్రచారం చేపట్టారు. ములియగుడ, డమ్ముకు, కాశీపట్నం, .చిలకలగెడ్డ, బొర్రా గుహలు తదితర ప్రాంతాల్లో కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు అనంతరం ఈ సందర్భంగా స్థానిక జెడ్పిటిసి గంగరాజు మాట్లాడుతూ, ఈ బందుకు ప్రజాసంఘాల, రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. గిరిజనులు అధికంగా హాజరై తమ నిరసన గళాన్ని ప్రభుత్వానికి వినిపించేందుకు బందుకు కదిలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సర్పంచ్ కె.మొస్య, గిరిజన సంఘం మండల నాయకులు జె.సుబ్బారావు, ఎస్.నాగులు, టిడిపి పార్టీ నాయకులు శంకర్రావు, భీమన్న, దయానిధి, రవీంద్ర, వైసీపీ నాయకులు చిట్టిబాబు పాల్గొన్నారు.

జి.మాడుగుల:31న మన్యం బంద్‌ను విజయవంతం చేయాలని మద్దిగరువు వారపు సంత, పాలమామిడిలో సిపిఎం, టిడిపి నేతలు ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడు సోమేలి చిట్టిబాబు, మండల అధ్యక్షులు వంతాల కొండలరావు, మద్దిగరువు గ్రామ నాయకులు, తెలుగు యువత ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, పి.భీంబాబు, కె,భీంబాబు రమణబాబు, సిపిఎం మండల కార్యదర్శి సాగిన ధర్మన్నపడాల్, మండల నాయకులు దీనబంధు, కొటారి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : బోయ, వాల్మీకి, బొంత ఒరియా తదితర బీసీ కులాలను ఎస్టీ జాబితాలో చేర్చాలని ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయడాన్ని నిరసిస్తూ ఈ నెల 31న గిరిజన సంఘం, ఆదివాసీ జేఏసీ తలపెట్టిన రాష్ట్రవ్యాప్త మన్యం బంద్‌ను విజయవంతం చేయాలని గురువారం గిరిజన సంఘం నాయకులు మండలంలోని లోదొడ్డి పంచాయతీలో విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం మండల నాయకులు మేలిన రమేష్ మాట్లాడుతూ గిరిజనులకు అన్యాయం చేసే పాలకుల కుట్రలను గిరిజనులు ఐక్యంగా తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర బంద్‌లో గిరిజనులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల నాయకులు జర్తా రాజు, పొత్తూరి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి సీతారామరాజు యువజన సంఘం మద్దతు

గిరిజన సంఘం, ఆదివాసీ జేఏసి ఆధ్వర్యంలో ఈ నెల 31న తలపెట్టిన మన్యం బంద్‌కు అల్లూరి సీతారామరాజు యువజన సంఘం తరపున సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని ఆ సంఘం వ్యవస్థాపకులు పడాల వీరభద్రరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు, బోయ వాల్మీకిలను ఎస్టి జాబితాలో చేర్పిస్తామని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఈనెల 24న అసెంబ్లీలో తీర్మానాన్ని ప్రవేశ పెట్టడం అన్యాయమన్నారు, ఆ తీర్మానాన్ని వెంటనే రద్దు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రానున్న ఎన్నికలు నేపథ్యంలో ఇటువంటి నిర్ణయాలు ఓట్లు రాజకీయంగా ఆయన అభివర్ణించారు, ఆదివాసీలకు ఆమోదయోగ్యం కానీ ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని కోరారు.


కరపత్రాలు పంపిణీ చేస్తున్న జెడ్‌పిటిసి సభ్యులు గంగరాజు


లోదొడ్డిలో బంద్ నేపథ్యం గురించి గిరిజనులకు వివరిస్తున్న సంఘం నాయకులు


చలో ఢిల్లీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నేతలు

చలో ఢిల్లీని జయప్రదం చేయండి

ప్రజాశక్తి -అనంతగిరి:కర్షకులు, కార్మికులపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తోన్న విధానాలపై ఏప్రిల్ 5న చేపట్టే చలో ఢిల్లీ విజయవంతం చేయాలని కోరుతూ గురువారం స్థానిక గిరిజన సంఘం కార్యాలయం వద్ద సిఐటియు మండల కార్యదర్శి కిల్లో. మొస్య అధ్యక్షతన పోస్టర్‌ను ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా స్థానిక జెడ్పిటిసి డి.గంగరాజు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం కర్షక, కార్మికులతో వెట్టి చాకిరి చేయిస్తోందని విమర్శించారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, పెన్షన్ రూ. 10వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల నాయకులు ఎస్.నాగులు, జె. సుబ్బారావు, రైతు సంఘం నాయకులు.పి.భీమన్న తదితరులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి ప్రకటన

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో వివిధ ప్రభుత్వ శాఖలలో విభిన్న ప్రతిభావంతులకు కేటాయించిన 24 బ్యాక్‌లాగ్ ఉద్యోగ ఖాళీలు భర్తీ చేయుటకు ఉమ్మడి విశాఖపట్నం వికలాంగుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తూ విశాఖ జిల్లా కలెక్టర్ గురువారం ప్రకటన విడుదల చేశారు. అంధులకు 9, బధిరులకు 8, శారీరక వైకల్యం 7 ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. కనీస అర్హతలు, పోస్టుల వివరాలు, నోటిఫికేషన్, సూచనలు, దరఖాస్తుకు https://visakhapatnam.ap.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. దరఖాస్తులను సహాయ సంచాలకులు, విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, రాణీ చంద్రమణీదేవి ఆసుపత్రి ప్రాంగణం, పెద వాల్తేర్ జంక్షన్, విశాఖపట్నం-530017 చిరునామాకు ఏప్రిల్ 13లోగా అందజేయాలని పేర్కొన్నారు.

ఉపాధి కూలీలకు సదుపాయాలు కల్పించాలి : సిపిఎం

ప్రజాశక్తి-అనకాపల్లి : ఉపాధి కూలీలకు పనిచేసేచోట తాగునీరు ఏర్పాటుచేసి, పనిముట్లు పంపిణీచేయాలని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్‌చేశారు. పని ప్రాంతంలో దెబ్బతగిలితే ప్రాథమిక చికిత్స చేసేందుకు కిట్స్ కూడా అందుబాటులో ఉంచడంలేదని, ఎండల నుంచి ఉపశమనం పొందేందుకు పరదాలు కూడలేకపోవడం విచారకరమని పేర్కొన్నారు. రెండు పూటలా పనిచేసినా కూలి గిట్టడంలేదని తెలిపారు. 2014లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం వ్యూహాత్మకంగా ఈ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఎనిమిదేళ్ళుగా ప్రతి సంవత్సరం ఉపాధి హామీ పథకానికి బడ్జెట్లో నిధులు తగ్గిస్తూ వస్తోందని పేర్కొన్నారు. ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.20 వేల కోట్లను తగ్గించిందని తెలిపారు. ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించడంతో కూలీలకు పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయని వివరించారు. ఉపాధి పథకాన్ని రక్షించుకునేందుకు, సౌకర్యాలు, మెరుగైన వేతనాలు సాధించేందుకు కూలీలు ఐక్యంగా పోరాడేందుకు సిద్ధంకావాలని పిలుపునిచ్చారు.

సికింద్రాబాద్ - అగర్తల మధ్య ప్రత్యేక రైలు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ప్రయాణికుల అదనపు రద్దీని క్లియర్ చేయడానికి, సికింద్రాబాద్ – అగర్తల మధ్య వన్ వే ప్రత్యేక రైలును నడపాలని రైల్వే నిర్ణయించింది. రైలు నంబర్ 07018 సికింద్రాబాద్ – అగర్తల ప్రత్యేక రైలు ఏప్రిల్ 2వ తేదీ ఆదివారం సికింద్రాబాద్‌లో ఉదయం 11 గంటలకు బయలుదేరి మంగళవారం రాత్రి 23.15 గంటలకు అగర్తల చేరుకుంటుంది. ఈ రైలు పగిడిపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లె, గుంటూరు, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, దువ్వాడ, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం రోడ్, బెర్హంపూర్, ఖుర్దా రోడ్, భువనేశ్వర్, కటక్, భద్రక్, బర్ధన్‌పూర్, బాలాసోర్, మాల్దా టౌన్, కిషన్‌గంజ్, న్యూ జల్‌పైగురి, జల్‌పైగురి రోడ్, న్యూ కూచ్ బెహార్, న్యూ అలీపుర్‌దువార్, న్యూ బొంగైగావ్, గోల్‌పారా, గౌహతి, జాగీ రోడ్, హోజాయ్, లుమ్‌డింగ్, న్యూ హాఫ్లాంగ్, బదర్‌పూర్, న్యూ కరీంగంజ్, ధర్మనగర్ మీదుగా ప్రయాణిస్తుంది.

ఇంజినీరింగ్ యానిమేషన్ వీడియోల తయారీకి

స్మార్ట్‌జెన్‌తో గీతం ఎంఒయు


ఒప్పందపత్రాలు మార్చుకుంటున్న గీతం, స్మార్ట్‌జెన్ ప్రతినిధులు

ప్రజాశక్తి- మధురవాడ : యానిమేషన్ సాయంతో ఇంజినీరింగ్ విద్యాబోధన ద్వారా విద్యార్థులకు పాఠ్యాంశాలు సులభంగా అర్థమయ్యే అవకాశంఉందని గీతం రిజిస్ట్రార్ ఆచార్య డి.గుణశేఖరన్ అన్నారు. ఈ సరికొత్త విధానంలో అవసరమైన యానిమేషన్ వీడియోల తయారీకి స్మార్ట్‌జెన్ సంస్థతో గీతం డీమ్డ్ వర్సిటీ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. గురువారం గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, స్మార్ట్ జెన్ సిఇఒ నవీన్ అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ ఈ ఆలోచన విజయవంతం కావాలని ఆకాంక్షవ్యక్తం చేశారు.
గీతం రీసెర్చి అండ్ కన్సల్టెన్సీ డైరక్టర్ డాక్టర్ రాజా ఫణిపప్పు మాట్లాడుతూ యానిమేషన్ తయారీకి అవసరమైన విధంగా ఇంజనీరింగ్ సిలబస్‌ను అందుబాటులోకి తేవాలన్నది ఉద్దేశ్యమన్నారు. స్మార్ట్ జెన్ సంస్థ నిపుణులతో గీతం ఫ్యాకల్టీ సభ్యులు కలిసి పనిచేస్తారన్నారు. గీతం పారిశ్రామిక సంబంధాల విభాగం అధిపతి సోమ్ భట్ మాట్లాడుతూ నూతన పద్ధతిలో ఇంజనీరింగ్ విద్య సులభంగా అవగాహనకు యానిమేషన్ వీడియోలు దోహదపడతాయన్నారు. స్మార్ట్ జెన్ సిఇఒ నవీన్ మాట్లాడుతూ ఇంజనీరింగ్‌లో డిజిటల్ బోధనకు తమ యానిమేషన్ వీడియోలు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో గీతం కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ శిరీష పాల్గొన్నారు.

నీటి శుద్ధి పరికరాల అందజేత

ప్రజాశక్తి -భీమునిపట్నం : రుషికొండ సముద్ర తీర భద్రతా పోలీస్‌స్టేషన్‌కు రూ.26 వేలు విలువైన రెండు వాటర్ ఫ్యూరిఫైయర్లను భీమిలి మండలం, చిప్పాడ దివీస్ సంస్థ సిఎస్ఆర్ మేనేజర్ డి సురేష్‌కుమార్ గురువారం అందజేశారు. వీటిని పోలీస్‌స్టేషన్‌లో సిఐ సిహెచ్ చంద్రశేఖర్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఐ మురళీకృష్ణ, దివీస్ ప్రతినిధి పి శేఖర్‌బాబు పాల్గొన్నారు.



పోలీస్‌స్టేషన్‌కు అందజేసిన నీటి శుద్ధి పరికరాలు

రాజుకు ఘననివాళి

ప్రజాశక్తి- వేపగుంట : ఇటీవల మృతి చెందిన 93వ వార్డు వైసిపి అధ్యక్షుడు దాసరి రాజుకు పలువురు ఘననివాళులర్పించారు. దాసరి రాజు జయంతి సందర్భంగా గురువారం ప్రహ్లాదపురం జంక్షన్, శివాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ముందుగా కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు, దాసరి రాజు కుటుంబసభ్యులు, వైసిపి నేతలు ఆదిరెడ్డి మురళి, బండి సత్తిబాబు, దాసరి సత్తిబాబు, హరి, నిర్మల, సిఐటియు నాయకుడు బలివాడ వెంకటరావు, పాల్గొన్నారు.

కన్నుల పండగగా సీతారాముల కల్యాణం

భక్తులతో కిక్కిరిసిన శ్రీరామగిరి


శ్రీరామగిరిలో నవమి వేడుకల్లో భారీగా పాల్గొన్న భక్తులు


సీలేరులో శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా మహిళల కోలాటం

ప్రజాశక్తి- విఆర్.పురం

శ్రీరామనవమి సందర్భంగా మండలంలోని శ్రీరామగిరి గ్రామంలో సీతారాముల వారి కల్యాణ మహోత్సవం గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కల్యాణ మండపంలో సీతారాములను సుందరంగా అలంకరించారు. 12 గంటలకు అభిజిత్ ముహూర్తంలో సీతారాముల కల్యాణం జరిపించారు. కల్యాణాన్ని తిలకించేందుకు విఆర్.పురం, చింతూరు, కూనవరం, వేలూరుపాడు మండలాలతో పాటు చత్తీస్‌ఘడ్, ఒరిస్సా రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. విఆర్.పురం, కూనవరం ఎస్సైలు టి దుర్గాప్రసాద్, వెంకటేష్ ఆధ్వర్యాన భారీ బందోబస్తు నిర్వహించారు. పలు స్వచ్ఛంద సంస్థలు భక్తుల కోసం అనేక చోట్ల రహదారులు ఇరుపక్కల ప్రత్యేకంగా మంచినీళ్ల, పులిహోర, మజ్జిగ, బెల్లం పానకం, అన్నదానం కార్యక్రమాలు ఏర్పాటు చేశాయి. ఈ కార్యక్రమంలో శ్రీరామగిరి సర్పంచ్ పులి సంతోష్ కుమార్, ఉప సర్పంచ్ దుర్గారావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

చింతూరు : మండల కేంద్రంలో కోదండరామ ఆలయ ప్రాంగణంలో చలువ తాటాకు పందిళ్లు వేసి తోరణాలు కట్టి సీతారాముల కళ్యాణం కన్నుల విందుగా నిర్వహించారు. ఎస్టి కాలనీవాసులు భక్తులకు పానకాలు భోజనాలు ఏర్పాటు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుండి వందలాదిగా తరలివచ్చి సీతారాముల కల్యాణాన్ని తిలకించారు. ఆలయ అర్చకులు దాసరి రవిశంకర్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : మండలంలోని రాజవొమ్మంగి, జడ్డంగి, లాగరాయి, శరభవరం, కింద్ర, చెరుకుంపాలెం తదితర గ్రామాల్లోని రామాలయాల్లో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయాల వద్ద వందలాది మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సాయిబాబా గుడి వద్ద చిన్నారులు ప్రదర్శించిన కోలాటం ఎంతగానో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఆయా పంచాయతీల సర్పంచులు జి రమణి, సీహెచ్ శివ, కొంగర మురళీకృష్ణ, డి నాగేశ్వరావు, లబ్బర్తి ఎంపీటీసీ జి పెద్ది రాజు పాల్గొన్నారు.

సీలేరు : జీకే వీధి మండలం సీలేరు, వలసగెడ్డ, దారకొండ గ్రామాల్లో సీతారాముల కళ్యాణ మహోత్సవం గురువారం వైభగంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు నిర్వహించిన కోలాటం ఆకట్టుకుంది. అనంతరం ఆలయ ప్రాంగణంలో భారీ సమారాధన ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

డుంబ్రిగూడ:మండలంలోని అరుకు సంత బయలులో శ్రీరామ మందిరంలో గురువారం శ్రీ రామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. సుమారు 200 మందికి అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సిహెచ్ జానకమ్మ, వైసీపీ మండల నాయకుడు సిహెచ్ కృష్ణారావు, ఆలయ ధర్మకర్త సుహాసిని పాల్గొన్నారు.

పెదబయలురూరల్:స్థానిక సాయిబాబా దేవాలయంలో సీతారామ కళ్యాణం వైభవంగా జరిగింది. భక్తులు పోటెత్తారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు.

అనంతగిరి:మండలంలోని అనంతగిరి, .కాశీపట్నం, భీమవరం గ్రామాలలో శ్రీ రామనవమి ఘనంగా జరిగింది. భీమవరం గ్రామంలో మాజీ ఎమ్మెల్యే శోభ. హైమావతి కుటుంబ సభ్యులు పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

పాడేరు:పట్టణంలోని సుంద్రుపుట్ రామాలయం లో ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి దంపతులు పట్టు వస్త్రాల స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. వాసవి క్లబ్ ఆధ్వర్యంలో భక్తులకు వడపప్పు పానకం పంపిణీ చేశారు. పాడేరు మండలం ఇరడాపల్లి పంచాయతీ రాయిగడ్డ, పాత పాడేరు గ్రామంలోని సీతారాముల కల్యాణోత్సవం అతి వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు కల్యాన్ని తిలకించారు.


పెదబయలులో శ్రీరామ కల్యాణంలో భక్తులు


చింతూరులో శ్రీరామనవమి వే డుకలు

సభ్యులకు మెరుగైన సేవలో 'త్రిఫ్ట్' సొసైటీ



57వ మహాజన సభలో పాల్గొన్న త్రిఫ్ట్ ప్రతినిధులు

ప్రజాశక్తి-ఉక్కునగరం : ఆవిర్భావం నుంచి గడచిన 36ఏళ్లుగా 14,065 సభ్యులకు మెరుగైన సేవలు అందిస్తూ, రూ.387కోట్ల వార్షిక టర్నోవర్‌తో, ఏటా ఆడిట్ వర్గీకరణలో 'ఏ' గ్రేడ్ సొసైటీగా స్టీల్‌ప్లాంట్ త్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ దూసుకుపోతోందని సొసైటీ ఉపాధ్యక్షుడు కె. ఆనందకుమార్ అన్నారు. స్టీల్‌క్లబ్‌లో నిర్వహించిన 57వ మహాజన సభకు అధ్యక్షతన వహించిన ఆయన మాట్లాడుతూ, సభ్యుల డిపాజిట్స్ త్రిఫ్ట్ ఫండ్, రిటైర్‌మెంట్ ఫండ్స్‌పై 80శాతం మొత్తాన్ని సెక్యూరిటీ లోన్‌గా ఇవ్వడానికి, అలాగే ,సూపర్ యాన్యుయేషన్ బెనిఫిట్ ఫండ్‌గా ప్రస్తుతం సంవత్సరానికి చెల్లిస్తున్న రూ.750లను రూ.850లుగా పెంచి చెల్లించేందుకు పాలకవర్గం చేసిన ప్రతిపాదనలకు సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదించారు.
సొసైటీ కార్యదర్శి డి.శ్రీరామచంద్రమూర్తి వార్షిక నివేదికను, కోశాధికారి డివివిఎస్ఎస్ కొండరాజు 2023-24 అంచనా బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా. మహాజన సభ ఆమోదం తెలిపింది డైరక్టర్ ఎమ్‌వి.రమణ బైలా సవరణలను ప్రతిపాదించారు. అంతకుముందు మరణించిన సభ్యులకు డైరెక్టర్ లాలూ భూక్యా సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. డైరక్టర్ కర్రి శ్రీనివాస్ వందన సమర్పణతో మహాజన సభ ముగిసింది. కార్యక్రమంలో డైరక్టర్లు జివి.రమేష్, విజి.మహీధర్, వివిధ కార్మిక సంఘ నాయకులు, మాజీ పాలకవర్గ సభ్యులు, సంఘ సభ్యులు, సీనియర్ మేనేజర్ కె.దామోదరరెడ్డి, సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

సిఐటియు ఆధ్వర్యాన మజ్జిగ చలివేంద్రం

ప్రజాశక్తి -ములగాడ: జివిఎంసి 40వ వార్డు నౌసేనాబాద్ మినీ మోటారు స్టాండ్ వద్ద గురువారం సిఐటియు మోటార్ ట్రాన్స్‌పోర్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మజ్జిగ చలివేంద్రాన్ని మల్కాపురం ట్రాఫిక్ సిఐ తులసీదాస్ ప్రారంభించారు. ఈసందర్భంగా సిఐ మాట్లాడుతూ, ఇటువంటి మంచి కార్యక్రమం నిర్వహించిన సిఐటియు మోటార్ యూనియన్ అభినందనీయులన్నారు. మండుతున్న ఎండలు నేపథ్యంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ సందర్భంగా మజ్జిగ చలివేంద్రానికి తనవంతుగా రూ.వెయ్యి ఆర్థికసాయాన్ని అందించారు.కార్యక్రమంలో మోటార్ ట్రాన్స్‌పోర్ట్ జిల్లా నాయకులు జి.అప్పలరాజు, సిఐటియు మల్కాపురం జోన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.పెంటారావు, ఆర్.లక్ష్మణమూర్తి, మోటార్ స్టాండ్ అధ్యక్షులు ఆర్.అప్పారావు ఉపాధ్యక్షులు జి.సత్యనారాయణ, కార్యదర్శి భిక్షపతి, కోశాధికారి ఎం.అప్పారావు, సభ్యులు ఆర్.ధర్మారావు, అప్పలనాయుడు, తమ్మారావు, శ్రీను, కుమార్, సంతోష్ నాగబాబు పాల్గొన్నారు.

కార్మికుని కుటుంబానికి రూ.20 లక్షల పరిహారం

ప్రజాశక్తి -ములగాడ: హెచ్‌పిసిఎల్‌లోని జ్ఞానసాయి ఇంజినీరింగ్ కాంట్రాక్టర్ వద్ద పనిచేస్తూ, మృతి చెందిన కార్మికుడు వై.సుధాకర్ కుటుంబానికి సంస్థ తరపున అధినేత జనార్ధనరావు రూ.20 లక్షల నష్టపరిహారం చెక్కును అందజేశారు. హెచ్‌పిసిఎల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మజ్జి సోమేష్ సమక్షంలో 61వ వార్డు వైసిపి ఇన్‌ఛార్జి దాడి సత్యనారాయణ చేతుల మీదగా మృతుని కుటుంబానికి నష్టపరిహారాన్ని చెక్కు రూపంలో అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు కలిదిండి బద్రీనాథ్, హెచ్‌పిసిఎల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు బోగవెల్లి కరుణాకర్ పాల్గొన్నారు,